ఓమ్

లలితాంబాయైనమః

పండుగలు

# విజయదశమి-దీపావళి

## సంక్రాంతి

చర్ల గణపతిశాస్త్రి

వెం 0.25

# విజయ దశమి – దీపావళి

—చర్ల గణపతిశాస్త్రి

కాలమునకు దిక్కులకు జీవులకు హద్దులు పేర్లు అని ఏమియు లేవు. వాని మొగముమీద ఇది హద్దు అనిగాని ఇది పేరు అనిగాని ఏమియు ఉండవు. యుగాలు సంవత్సరాలు తూర్పు పడమర రాముడు కృష్ణుడు అని మనము వ్యవహారము కోసము పెట్టుకొన్నవే. సూర్యచంద్రుల యుదయాస్తమయాలనుబట్టి విభజన చేసికొన్నాము. వీటికి సహాయపడినవారు మహర్షులు. వారు అనంత శక్తిగల దివ్యజ్ఞానము దూరదృష్టి గలవారయి గ్రహగతులనుబట్టి కల్పాలు ఏర్పఱచి చివరకు ప్రతి జీవికిని గ్రహసంచారమునకును గల సంబంధమును తెలిసికొని లెక్కలుకట్టి జీవికి శుభాశుభ ఫలాలు చెప్పగలిగిరి. అందుకై శాస్త్రములు రచించిరి. వానిని సరిగా గ్రహించక పోవుటచే అనేకములగు పొరపాట్లకు లోనయి వానియందు విశ్వాసము లేకుండ చేసికొన్నాము. అనంత కాలమును కొలుచునవి యుగాలు వత్సరాలు మొదలైనవి. కాలమను వృక్షమునకు పర్వము లనేకములు. అవే పండుగలు.

నెలలు చైత్రముతో ప్రారంభమగును. చంద్రుడు పౌర్ణమినాడు ఏ నక్షత్రముదగ్గఱ వచ్చిన ఆ నక్షత్రముపేరుతో చైత్రాది నామములు వ్యవహరింపబడినవి. రాత్రియు పగలు ఏ నెలలో ఏ రోజున సమముగా నుండునో ఆ రోజుతో నెలలు ప్రారంభింపబడినవి. సమముగానున్న రోజును విషువత్తు అందురు. కృతయుగమున ధనిష్ఠ నక్షత్రమునాడు రాత్రింబవళ్ళు సమముగా నుండుటచే ధనిష్ఠ మొదలుకొని లెక్కించిరని టీకాకారాచార్యులు చెప్పిరి.

నవమ్యాం కృష్ణపక్షస్య పరగాత్కృత్తికం
త్రేతా సిత తృతీయాయాం వైశాఖే సమ వద్యత
దర్శేతు మాఘమాసస్య ప్రవృత్తం ద్వాపరం యుగం
కలిః కృష్ణ చతుర్దశ్యాం నభస్యే మాసి నిర్గతః.

కార్తీక శుద్ధ నవమినాడు కృతయుగము, వైశాఖ శుద్ధతదియనాడు త్రేతాయుగము, మాఘ బహుళ అమావాస్యనాడు ద్వాపరయుగము, భాద్రపదమాస బహుళ చతుర్దశినాడు కలియుగము ప్రారంభించ బడినవని విష్ణుపురాణము.

"ద్వాదశే మాసే, చైత్రే నావమికే తిథౌ కౌసల్యాఽ జనయద్రామం"

పన్నెండవదైన చైత్రమాసమున కౌసల్య నవమినాడు రాముని గనెను. అను రామాయణ వచనమునుబట్టి చైత్రమాసము పన్నెండవమాసముగా ఉన్నదనియు దానినిబట్టి వైశాఖమాసము మొదటిమాసముగా ఉన్నదనియు క్రమముగ గ్రహసంచారములో మార్పులుకలిగి చైత్రమాసమే మొదటిమాస మయ్యెననియు తెలియవలయును.

సంవత్సరాదిని యుగాది అని కాలక్రమమున ఉగాదియని పిలుచుచు వచ్చితిమి. మన పూర్వులు మహర్షులు పండుగలను చెప్పుటలో వారిదృష్టి బహుముఖములయినది. ప్రజలలో ఎప్పటికప్పుడు నూతనోత్సాహము కల్పించుట, కాలపురుషుని సంచారములోగల మార్పులు, గ్రహసంచారమునుబట్టి ఫలములు తెలుపుట ప్రజలను కర్తవ్యపరాయణ పరాయణులను చేయుట మొదలయినవి వారి యుద్దేశములు. మన పూర్వులు ఏమిచెప్పినను సామాన్య మానవులను జ్ఞానులను దృష్టిలోపెట్టుకొని చెప్పిరి. సామాన్యులకు మహిమలు శకునశాస్త్రాది తాత్కాలిక లాభములు చెప్పినగాని విశ్వసించి యుత్తమకార్యములు చేయరు. జ్ఞానులో అట్లుగాక కర్తవ్యదృష్టితో వాని మూలాశయములు గ్రహింతురు. కనుక మన మహర్షులు చెప్పినదానిని ఈ దృష్టితో జూడవలయును.

ఉత్తమ సత్యములను ఆచరించిన శ్రీరామ శ్రీకృష్ణాది మహాపురుషుల జన్మదినములను పర్వములుగా గ్రహించి పూజించుచు వారి అనంత కల్యాణ గుణములను మనము సంపాదించుటకే శ్రీరామనవమి శ్రీకృష్ణాష్టమి మొదలైన పండుగలను జరుపుకొనుచున్నాము.

ప్రస్తుతము మన ముద్దేశించిన విజయదశమి పండుగనుగూర్చి పరిశీలింతము.

ఆశ్వినస్య సితే పక్షే దశమ్యాం తారకోదయే
సకాలో విజయోనామ సర్వకామార్థ సిద్ధిదః. [చింతామణి]

ఆశ్వయుజమాసమున అనగా అశ్వినీనక్షత్రము దగ్గఱకు పూర్ణిమనాడు తన సంచారములో చంద్రుడువచ్చు మాసమున దశమినాడు నక్షత్రోదయమైన పిదపవచ్చు కాలము విజయదశమి అనబడును అది సకల కామములను సిద్ధింప జేయు పవిత్రకాలము.

సూర్యోదయే యదా రాజన్ దృశ్యతే దశమీ తిథిః
ఆశ్వినేమాసి శుక్లేతు విజయాం తాం విదుర్బుధాః

ఓ రాజా! ఆశ్వయుజ శుద్ధ దశమి సూర్యోదయసమయము సమయమున వచ్చిన తిథిని విజయదశమి అని బుధులు చెప్పిరి.

శరత్కాలమునవచ్చు రాత్రులు శరన్నవరాత్రులనియు వానిపిదపవచ్చిన దశమి విజయదశమి అనిరి. ఈ దశమి దశరా, దసరా అనియు పిలువబడు చున్నది. ఆశ్వయుజమాసములో వచ్చిన దశమినే విజయదశమి అని ఎందుకు అనవలయును అంటే ఇది దుష్టులయి పొగరెక్కిన రాజులతో దేశక్షేమమునకై యుద్ధముచేసి విజయము పొందదగిన కాలములోవచ్చు దశమి కాన దానికి విజయ దశమి అని పేరు వచ్చినదని మనము గ్రహింపవలయును. బ్రాహ్మణులు బ్రహ్మజ్ఞానముగలవారై జ్ఞానమును బోధించుచుండగా దేశక్షేమమునకు అంతరాయమును గలిగించు శత్రురాజులనుజయించి దేశములో శాంతినిగూర్చుట రాజుల పనియైనది. రాజుల జయించవలసినచో దానికి తగు ప్రయత్నాలు చేయవలయునుగదా అందుకు తగినకాలము ఆశ్వయుజమాసమునుండి ప్రారంభమగును. వేసవిలో నేల కాలి పవిత్రమగును. వర్షాకాలములో వర్షములు కురియును. భూమాత ఒడలు పులకరించును. సస్యశ్యామలమైన చేలమును భూదేవి ధరించును. ఆహారము లేనిదే ఏ పని చేయలేము. వర్షాకాలమున చేలు ఈని పంటలను కనును. మనవారు చాతుర్మాస్య వ్రతమును ఏర్పఱచిరి. ఆ కాలములో ఎవరును ఎక్కడికిని పోరాదు కృషీవలులు పంటలు పండించవలయును. గృహస్థులు తమ విధులను నెఱవేర్చవలయును. సంన్యాసులు కదలక ఒక చోటనే యుండి ప్రజలకు జ్ఞానబోధ చేయవలయును.

"శైశవేఽభ్యస్తవిద్యానాం యౌవనే విషయైషిణాం
వార్ధకే మునివృత్తీనాం యోగేనాంతే తనుత్యజాం."

అని కాళిదాసు ఇక్ష్వాకువంశ రాజులను వర్ణించుచు, వారు బాల్యములో విద్య నభ్యసించువారు యౌవనమున విషయములను కోరువారు వృద్ధత్వములో ముని వృత్తిగలవారు చివర రోగముచేగాక యోగముచే శరీరమును వదలువారు అని వర్ణించెను. ఇట విషయములనగా భోగములు అర్థమే అయినను దేశములు కూడ అర్థమగును. వారు యౌవనములో రాజ్యపాలనము చేయువారు గాన దుష్టుల చేతులలోబడి పోయి అశాంతముగానున్న దేశములను జయించి పాలించు వారయిరి అని దాని భావము.

వర్షములవల్ల దారులన్నియు బురదతో నిండియుండును కాన ప్రయాణమున కనుకూలముగా నుండదు. అందుచే ఎవరును ఎక్కడికిపోక దేశమునకు అవసరమగు పంటలను పండించుటలో నిమగ్నులుకావలెను. దారులు బురదతో గూడియుండుటయు ఒక వరమే. నేడు మనము తారురోడ్లు సిమెంటురోడ్లు నిర్మించుకొని దేశమునకవసరమైన ఆహారమును ఉత్పత్తిచేసికొను కాలములో కూడ శత్రువులవారికి యుద్ధములకు దారియిచ్చు విధముగా తయారుచేసికొని అశాంతికి, క్షామమునకు గూడ దారియిచ్చుచున్నాము.

కాళిదాసు రఘువును వర్ణించుచు బాగుగావర్షించి మేఘములు దారియివ్వగా రఘువుప్రతాపమును సూర్యునితాపమును దిక్కులను వ్యాపింపజేసెను. ఇంద్రుడు వార్షికధనువును ఉపసంహరింపగా రఘువు జైత్రధనువును దాల్చెను. ఇట్లు ఇంద్రుడు రఘువు ఒకరితరువాత నొకరు వరుసగా ధనువును ధరించిరట. శరదృతువు పద్మాతపత్రమును దాల్చి తెల్లపువ్వుల చామరమును దాల్చి రఘువు ననుకరించెనుగాని అతని లక్ష్మిని అనుకరింపలేక పోయెనట. నదులను దాట దగినవిగాను దారులను బురద ఎండినవిగను చేయుచు శరదృతువు ఉత్సాహశక్తి ముందుగనే దండయాత్రకు ప్రేరేపించెనట. ఇట్లు ఆశ్వయుజ మాసమునందలి కాలము రాజులను విజయయాత్రకు ప్రోత్సహించునది గాన దానికి విజయదశమిపేరు గలిగినది. కనుకనే,

శ్రవణర్క్షం యదా కాలే సా తిథి ర్విజయాభిధా
శ్రవణర్క్షేతు పూర్ణాయాం కాకుత్స్థః ప్రస్థితో యతః।

ఆ శ్రావణ భాద్రపదాల పూర్తికాగా శ్రీరాముడు రావణునిమీదికి బయలు దేరెను గాన దానికి విజయతిథి అని పేరుగలిగెను.

దానికి పిదప ఇట్లు శాస్త్రము బయలుదేరినది —

ఆశ్వినస్య సితేపక్షే దశమ్యాం సర్వరాశిషు
సాయంకాలే శుభా యాత్రా దివా విజయలక్షణా
ఏకాదశ్యో యో ముహూర్తో విజయః పరికీర్తితః
తస్మిన్ సర్వై స్సర్వైర్విధాతవ్యా యాత్రా విజయకాంక్షిభిః.

అన్నిరాష్ట్రంలోను ఆశ్వయుజశుద్ధ దశమినాడు సాయంకాలము శుభమైన యాత్ర చేయవలయును. దశమి పిదప ఏకాదశినాడు గల ముహూర్తము విజయము పొందు లక్షణములు గలది. అందు విజయమునుకోరు సర్వ మానవులు యాత్ర చేయవలయును. రాజులు రాజ్యాలను జయించుటకోనమైతే బ్రాహ్మణులు మొదలగు అన్యులు విద్యలను, దుర్గుణాలను, అజ్ఞానమును జయించుటకు యాత్ర చేయవలయును. సంన్యాసులు వర్షాకాలము చాతుర్మాస్య వ్రతమునరిపి ఆ నాలుగునెల లెక్కడకు పోక పిదప వెళ్ళెడివారు. గౌతమబుద్ధు డిట్లు చేసినట్లును గలదు:

దశమీం యస్సముల్లంఘ్య ప్రస్థానం కురుతే నృప
తస్య సంవత్సరం రాజ్యే న క్వాపి విజయో భవేత్.

“దశమిని యాత్ర చేయకపోయినచో ఓ రాజా! వానికి ఆ సంవత్సరములో ఇంకెక్కడను విజయము కలుగదు” అనికూడ చెప్పబడినది. కనుక ప్రతి కార్యము విజయదశమికి ప్రారంభించి జయము పొందవలయును.

మార్గశీర్షే శుభే మాసి యాయాద్యాత్రాం మహీపతిః

దశమికి అన్నియుసిద్ధముచేసికొని మార్గశిరమాసములో యాత్రకు రాజులు వెళ్ళవలయునని మనువు అనెను.

నీరాజయిత్వా సైన్యాని ప్రయాంతి విజిగీషవః
అన్యోన్య రాష్ట్రాభిముఖాః పార్థివ విశేషతః

సైన్యములకు నీరాజనములిచ్చి ఒండొరుల రాష్ట్రములకు అభిముఖులై విజయముకోరి పార్థివులు వెళ్లెదరని పూరితంబు,

తతః ప్రాతః పూజయిత్వా దశమ్యాం విధిపూర్వకం
సంప్రేషణం తు కర్తవ్యం గీతవాదిత్ర నిస్వనైః

దశమినాడు దేవికి పూజచేసి భేరీ దుందుభి వాద్యములతో బయలుదేర వలయునని దేవీపురాణము చెప్పుచున్నది. ఇందుచే దేవీపూజలు చేసి బయలు దేరుటకే దేవీ నవరాత్రములు అనుపేరుతో తొమ్మిది రోజులు పూజలు చేయు చున్నారు. ఆ యుత్సవాలలో పరస్పరము బురద పూసుకొనకపోతే దేవి అసం తుష్టురాలగు నన్నంతవరకు ఆచారము వచ్చినది.

దేవికూడ స్వయముగా మహిషాసురుని చంపుటకై కూడ దశమినాడు బయలుదేరినదని అందుచే విజయదశమి పేరు వచ్చినదని అనుచుందురు.

కౌత్సుడు దిలీపునిదగ్గఱకు గురుదక్షిణకై రాగా సర్వస్వ దక్షిణ అను యాగముచేసి సర్వధనములు దానముచేసిన దిలీపుడు కుబేరునిజయించి ధనము తెచ్చుటకై దశమినాడు బయలుదేరెనట.

రావణస్య వధార్థాయ రామస్యానుగ్రహాయ చ
అకాలే బ్రహ్మణాబోధో దేవ్యాస్త్వయి కృతః పురా

అని రావణునివధకై రాముని అనుగ్రహించుటకై ఆ కాలములోనే బిల్వవృక్షము పైని పరుండియున్న దేవిని పూర్వము బ్రహ్మ లేపినట్లును రాముడు దశమినాడు విజయయాత్రకై బయలుదేరినట్లును గలదు. రావణ వధానంతరము విజయము పొందినతర్వాత అయోధ్యకు వెళ్ళినట్లు గ్రంథాలు చెలుపుచున్నవి.

శ్రీరాముని విజయయాత్రను వాల్మీకి ఇట్లు వర్ణించెను.

సూర్యాతప క్రామణ నష్టపంకా, భూమిస్సముత్పాదిత పాండురేణుః
అన్యోన్య వైరేణ సమాయుతానా, ముద్యోగకాలో వసుధాధిపానాం

సూర్యుని యొక్క ఆక్రమించుటచేత బురద పోయినది. పూర్తిగా నేల ఎండిపోవుటచే దుమ్ముకూడ లేచుచున్నది. పరస్పర వైరముగల నరపతులు జయముకై బయలుదేరు కాలమిది.

అన్యోన్య బద్ధవైరాణాం జిగీషూణాం నృపాత్మజ
ఉద్యోగసమయ స్సౌమ్యః పార్థివానా ముపస్థితః
ఇయం సా ప్రథమాయాత్రా పార్థివానాం నృపాత్మజ.

ఓ లక్ష్మణా! బద్ధవైరులై జయింపగోరిన నృపాత్మజులు బయలుదేరి వెళ్లవట్టి చక్కని సౌమ్యమయిన కాలము ఇదిగో వచ్చినది. ఇది మొదటి యాత్రలో రాముడు అన్నట్లు కిష్కింధా కాండములో వాల్మీకి వర్ణించెను. రాముడు ఆశ్వయుజమాసములో సేనలను నడిపి ఫాల్గున అమావాస్యనాడు రావణుని జంపి రావణదహన సంస్కారముచేసి విదియకు విభీషణునికి పట్టముగట్టి తదియకు లంకవిడచి షష్ఠికి అయోధ్యకు చేరెనని రామాయణ వ్యాఖ్యలో గోవిందరాజు అనెను. విజయదశమి విజయముకై బయలుదేరు దినమే గాని విజయముపొందిన దినముగాదు.

భారతములోగూడ దీని వర్ణన గలదు.

"సౌమ్యోయం వర్తతేమాసః సుప్రాపయవసేంధనః
సర్వౌషధివనస్ఫీతః ఫలవానల్పమక్షికః
నిష్పంకో రసవత్తోయో నాత్యుష్ణశిశిరః సుఖం
సప్తమాచ్చాపి దివసా దమావాస్యా భవిష్యతి
సంగ్రామో యుజ్యతాం తస్యాం తా మాహుశ్శక్ర దేవతాం".

ఈ మాసము సౌమ్యమైనది. అన్ని ఓషధులగల వనముచేత నిండి పండ్లతో నిండియున్నది. బురద పోయినది. నీరు రుచిగలిగి అంత చల్లగాను అంత వేడిగాను గాక సమముగా నున్నది. నేటినుంచి ఏడవరోజు అమావాస్య సంగ్రామము యోజింపబడుగాక. ఆ తిథి ఇంద్రదేవతాకము॥ అని.

బ్రాహ్మణులు విద్యావంతులగుటకు సరస్వతీపూజచేసి విద్యలను పొంది అజ్ఞానమునుండి విజయముపొందు దినము విజయదశమిగా నున్నది. క్షత్రియులు ఆయుధపూజచేసి ఆయుధశక్తి పొంది ఆయుధాలను తయారుచేసి అశ్వగజాదిబలములకు నీరాజనముచేయు రోజు. అన్ని వర్ణములవారు తమ కృషికై తమతమ పరికరములను పూజించుదినము.

యాపూర్ణా నవమీయుక్తా తస్యాం పూజ్యాఽపరాజితా
క్షేమార్థం విజయార్థం చ ప్రసిద్ధ విధినానఘై।
నవమీ శేష సంయుక్తా దశమ్యామపరాజితా
దదాతి విజయం దేవీ పూజితా విజయార్థినీ. (పురాణ సముచ్చయ)

క్షేమముకొరకు విజయముకొరకు నరులు నవమితో గూడిన దశమి పూర్ణమైయుండగా అపరాజిత అనుకొక దానిని పూజింపవలయును. నవమి మిగులు గానున్న దశమినాడు అపరాజితను పూజించినచో మన విజయమును కోరునదై దేవి మనకు అన్నిపనులలోను విజయమును చేకూర్చును." అని చెప్పబడెను. "అపరాజిత అనగా కనక సూర్యక్రాంత విష్ణుక్రాంతలకు పేరుగా అయినదందురు.

అభిజ్ఞాన శాకుంతలములో దుష్యంతునికొడుకు శత్రుదమనుడు అను భరతునికి మారీచబ్రహ్మచే ఏ కష్టములను రాకుండుటకై ఈ అపరాజిత కట్టబడినట్లు వర్ణించబడినది.

ఈ కాలములో శక్తిపూజలు చేయుట ప్రభలు (గుడ్డలతో పెద్ద బండ్లుగా కట్టి యూరేగుట ; కోటప్పకొండ మొదలగుచోట్ల ఆచారముగ నున్నది.) కట్టి ఊరేగుదురు. ఆ యూరేగింపులో వస్తాదులు తమ బలప్రదర్శనము చేయుదురు. బాణాకర్రలు త్రిప్పుచు వీరప్రదర్శనలు చేయుదురు. ఆ మూడు రోజులు బట్టలు కుస్తీలు ఆయుధములకు పనికివచ్చునట్టి బాణసంచాలు కాల్చుదురు.

కాలపురుషుండొక సూత్రము ప్రకారము నడచును. వసంతఋతువుతో కాలపురుషు వచ్చిన కోరలను కట్టుకొని ఎఱ్ఱని చివురులు తలలో ముడుచుకొని

కళ్యాణోత్సవములై పెద్దపండుగ. అలంకారము లంగరక్షలు ధరించుచు వర్షాకాలపు పర్వపు పైరులను కనుచు. శరత్పూర్ణిమ నాటి దానములను ధరించి పిదప నవరాత్రులు ఉత్సవములై పవిత్ర బొమ్మలకొలువు తీర్చి ఆరగింపులు.

దశమినాడు ముఖ్యముగా శమీపూజ, పొలిమేర దాటుట—సాధు ప్రజలను బాధించిన రావణ కుంభకర్ణుల బొమ్మలను దగ్ధంచేయుట కూడ ముఖ్యముగా నున్నది.

శమీ శమయతే పాపం శమీ శత్రు వినాశినీ
ధరిత్ర్యర్జున బాణానాం రామస్య ప్రియ దర్శినీ.

జమ్మిచెట్టు పాపములను పోగొట్టునది. శత్రువులను నశింపజేయునది. అర్జునుడు మొదలైన వారి ఆయుధములను దాల్చినది. రామునికి ప్రియమైనది అని కూడ చెప్పబడినది. జమ్మికఱ్ఱలో అగ్ని యిమిడియున్నది. యాగములో జమ్మి అరణులను మథించి నిప్పు చేయుదురు. యాగములకు నిప్పు పుట్టించు జమ్మి పవిత్రమైనది. జమ్మిచెట్టు జడమైయుండి కూడ పాండవుల ఆయుధములను ధరించి ధర్మాత్ములకు సహాయపడినది. కావున వీరారాధన చేయు రోజులలో దీనిని పూజించుట అర్థమేగదా.

దీపావళి అమావాస్యకు ముందటిరోజు నరక చతుర్దశి నామము పేరుతో ప్రసిద్ధమై యున్నది. దీపావళి నరకాసురవధ, బలిచక్రవర్తి వామనునికి రాజ్యమును దానముచేయుట, రావణవధ పిదప రాముడు అయోధ్యచేరుట, విక్రమార్క పట్టాభిషేకము జరిగినట్లు తెలియుచున్నది. నరకాసురవధ దీపావళి కారణమని ధర్మశాస్త్ర గ్రంథములలో లేదు. "ఆశ్వయుజ కృష్ణ చతుర్దశ్యాం చంద్రోదయ వ్యాపిన్యాం నరక భీరుభి స్తైలేన నాభ్యంగస్నానం కర్తవ్యం. ఆల శాది కర్తవ్యం...." అను ధర్మ సింధువునుబట్టి ఆశ్వయుజ బహుళ చతుర్దశినాడు నరకలోకమువలన భయముగలవారు తలంటుపోసికొని స్నానముచేసి [illegible]లను ధరించి అమావాస్యనాడు బలిపూజ దీపోత్సవము (దీపావళి) గోక్రీడనము గోవర్ధనపూజ చేయవలయునని యున్నది. దీనినిబట్టి నరకలోక భయాంధకారమును పోగొట్టుకొనుటకై దీపావళి యుత్సవము జరుపబడుచున్నట్లు తెలియుచున్నది.

ఇట్లు కాలనియమములలో పూర్వులు అనేకమైన గొప్పభావములుగలుగు నట్లు తెలిపిన పర్వముల యోగ్యతలు కాలక్రమేణ వట్టి ఆచారములుగా మిగిలిపోయినవి. ఒక దృష్టితో చూచినచో వీనికన్నిటికి వేరే అర్థమున్నట్లు కనిపించుచున్నది.

వేసవిలో వసంతకాలం యజ్ఞములు వర్షాకాలములో సస్యాభివృద్ధి, చాతుర్మాస్య వ్రతములు భాద్రపదమాసములో పూర్వులగు పితరులను స్మరించు దినములు మహాలయములు. దేవీ నవరాత్రములలో విజయమునకై పుస్తకములను ఆయుధములను పరికరములను పూజించుట. విజయదశమికి ఆయుధ ప్రదర్శనము ప్రభల యూరేగింపు, బాణవిద్య ప్రదర్శనము (గింకబద్దలు ఇవి ప్రతి వానిని వీరునిచేసి దేశస్వాతంత్ర్య రక్షణకు సిద్ధముచేయుట సూచించుచున్నవి). దీపావళిలో బాణసంచా, కార్తీకదీప ప్రదర్శనలు, సంక్రాంతి బొమ్మలకొలువులు ఇవన్ని పరిశీలించి చూడగా ఈ విజ్ఞానయాత్రలు సందర్శనాలు వీరవ్యాయామములు దేశోన్నతికై ఏర్పడినట్లుతోచుచున్నది. పండితులను, కవులను, కర్తలను వీరులను తయారు చేయుటకై కాంచీ ప్రోత్సహించుపద్ధతి కనిపించుచున్నది. ఈ విధమైన పర్వముల ఏర్పాటులో నిముడియున్న సూత్రమును గ్రహించి అందుకై మనము దీక్షతో కృషియున్నచో దీనప్రజల కష్టనివారణకు, పరమేశ్వర భక్తికి, జ్ఞానాభివృద్ధికి ప్రతి సంవత్సరము కంకణము కట్టుకొను దినముగా అజ్ఞాన, దారిద్ర్యములమీద విజయముపొంద పూని యాత్రలు చేయుటకై బయలుదేరు శుభదినముగా ఈ విజయదశమి మనకు ప్రోత్సాహ మిచ్చుచున్నది. కాన మనము పరిశ్రమించి మన దేశమును సర్వతోముఖముగా అభివృద్ధిపరచుటకై నిరంతర దీక్షతో పూనుకొందుము గాక. ఇందుకై ఉగ్రపాలతో భావి పౌరులగు బాలబాలికలకు తగు దీక్ష యిచ్చెదముగాక. పరిశీలించిన విశేషములను నేర్పు వినోదముతో వివరించెదముగాక.

# సంక్రాంతి

యథార్థమైన విషయములు వేఱు, లోకవ్యవహారము వేఱు. సూర్యుఁడు ఉదయించెను సూర్యుఁడు అస్తమించెను అని యనుచుందుము. కాని అసలు సూర్యునికి ఉదయాస్తమయాలు లేవు. సూర్యుని చుట్టు భూమి పరిభ్రమించుట వలనను భూమి భాగము కొంత సూర్యునికి అడ్డుగా వచ్చుటవలనను సూర్యుఁడు మనకు కనిపించఁడు అపుడు సూర్యుఁడు అస్తమించెనని యందుము. అట్లే భ్రమణములో సూర్యునికి మన భూమి భాగము అడ్డురాకపోవుటచే సూర్యుడు మనకు కనిపించును అపుడు సూర్యుడు ఉదయించెనని యందుము. సూర్యుఁడు అమెరికా ఖండములో ఉదయించునప్పుడు మనకిక్కడ సూర్యుడు కనిపించఁడు. సూర్యుఁడిక్కడ అస్తమించునప్పటికి అమెరికాలో ఉదయించును. భూమి తన చుట్టుతాను తిరుగుచు సూర్యుని చుట్టు తిరుగుటవలన రాత్రియు పగలును ఏర్పడుచున్నవి. భూమి భ్రమణము వలననే భారత భూభాగములో పశ్చిమమునకు వెళ్ళనకొలది సూర్యుడు కనిపించుట ఆలస్యమగుచుండును కాన ఉదయము ఆలస్యమగును. తూర్పునకు వెళ్ళనకొలఁది తొందరగా సూర్యుఁడు కనిపించుచుండును, అపుడు ఉదయము త్వరగా అగును

వ్యవసాయదారులు కార్తెలను బట్టి కాలములు తెలిసికొందురు. "రోహిణి కార్తెలో ఎండలు హెచ్చుగునని ఇదిగో మృగశిర కార్తె వచ్చుచున్నది. ఆర్ద్ర వచ్చుచున్నది వర్షములు కురియును, గింజలు చల్లవలయు"నని యిట్లు తెలిసి వ్యవసాయపు పనులు నెఱవేర్చుచుందురు. కార్తెలను గూర్చి సూర్యోదయాదులను వలెనే మనము అర్థము చేసికొనవలయును. పరిభ్రమణలో భూమి సూర్యుఁడు రోహిణి నక్షత్రము ఒకే రేఖలోనికి వచ్చినపుడు రోహిణికార్తె అందుము అపుడు రోహిణి నక్షత్రము మనకు ఆకాశములో కనిపించదు. సూర్యునివెనుక ఉండుటచే సూర్యుని తేజస్సులో అది కనిపించదు. అట్లే మృగశిర కార్తె ఆర్ద్ర కార్తె చిత్రకార్తె అనునవియును అని మనము గ్రహింపవలయును

సంక్రాంతి పండుగ అని. మనము వ్యవహరించునది మకర సంక్రాంతి కదా. మకరరాశిలో సూర్యుడు ప్రవేశించినప్పటి కాలము అన్నమాట. మకర మనగా కొన్ని నక్షత్రములు కలిసిన రాశి. 2 నక్షత్రములు

ఒక రాశి అగును. నక్షత్రమునకు నాలుగు పాదములు 9 పాదములు ఒక రాశి. ఉత్తరాషాఢ నక్షత్రములోని 2వ 3వ 4వ పాదములు మూడును శ్రవణ నక్షత్రములో నాలుగు పాదములు ధనిష్ఠా నక్షత్రములోని, రెండు పాదములు మొత్తము ఈ తొమ్మిది మకర రాశి యగును. రెండు నక్షత్రములు కలిసి ఉత్తరాషాఢ అగును. ఏన ఆకారముగల మూడు నక్షత్రములు శ్రవణము తల ఆకారముగల మూడు నక్షత్రములు ధనిష్ఠ. కర్కాటకరాశి నుండి మకరరాశి వరకు ఆరు రాసులు దక్షిణాయనము. ఉత్తరాయణము కర్కాటకము వరకు గల కాలము. దక్షిణాయనము పితృదేవతల కిష్టమగు కాలము ఉత్తరాయణము దేవతల కిష్టమగు పుణ్యకాలము. అనగా భూమి భ్రమించుచు కర్కాటకము నుండి మకరరాశి పైపుగా వచ్చినదన్నమాట. సులభముగా తెలియుటకై సూర్యుడు మకరరాశిలో ప్రవేశించిన కాలము సంక్రాంతి యని చెప్పబడినది. అంటే భూమి సూర్యుడు మకరరాశి ఒకే వరుసలో నున్నవన్నమాట

"తత్ర మేషాదిషు ద్వాదశరాశిషు క్రమేణ సంచరతః సూర్యస్య పూర్వస్మాద్రాశే: ఉత్తరరాశౌ సంక్రమణ ప్రవేశః సంక్రాంతిః" (కల్పద్రుమము.)

"అందు మేషము మొదలైన పన్నెండు రాసులలోను క్రమముగా సూర్యుడు సంచరించుచుండగా మొదటి రాశినుండి తరువాత రాశిలోనికి సంక్రమించుట ప్రవేశించుటను సంక్రాంతి" అందురు అందు సూర్యుడు మకరరాశిలో ప్రవేశించిన దినము మకర సంక్రాంతి అని చెప్పుదురు. దానిని పెద్ద పండుగగా జనులు భావింతురు. దీనిని పెనుపండువు అని శ్రీనాథుడు వర్ణించెను. ఈ సంక్రాంతి మార్గశిర మాసము పిదప వచ్చును. సస్యశ్యామలమైన భూమి పులకరించి ఫలించును. ధనధాన్యముల సంపదలతో పశుసంపదలతో జనులు తులతూగుచుందురు. గుమ్మడిబంతి చేమంతి పూలతో భూదేవి అలంకరించుకొనును. అందుచేతనే శ్రీకృష్ణుడు 'మాసానాం మార్గశీర్షోస్మి' మాసాంలో నేను మార్గశిరమాసమని గీతలో విభూతులలో చెప్పెను సకల గములతో జనులు వింది యుండుటకు అవకాశమిచ్చు కాలము కాన దానికి భోగి యనియు పేరు. గొబ్బ భోగిగల అమ్మ వచ్చునుగాన గొబ్బెమ్మ అయినదేమో, బాలికలు గొబ్బెమ్మకు పూజలు చేయుదురు. గొబ్బెమ్మ అనగా గౌరమ్మ. గొబ్బి అన్నది గొబ్బిమిడి చెట్టునకును పేరు పేడయుండలమీద బంతి మొదలగు పూవులు గుచ్చి యుడయుమున తిరుగుచు బాలలు ఆడుచుండుట ఆచారము. బ్రాహ్మణులు గంగిరెద్దులు

గొబ్బిళ్లు అనియు పొంగలికిని దేవతలకును గొబ్బికినిగొంతెత్తి పడతులెల్ల కుంతలా కుప్పురిచ్చు" అభిధానచింతామణిలో వర్ణింప బడెను. మొదటి రోజు భోగి రెండవ రోజు సంక్రాంతి

త్రిశీర్షం ద్విముఖం చైవ చతుర్వక్త్రం త్రినేత్రకం,
లంబకర్ణం చ కదంతం లంబభ్రూ దీర్ఘనాసికం,
శతయోజనవైస్తృత్యం విస్తీర్ణం ద్వాదశస్మృతం,
ఏవం రూపంచ విజ్ఞేయం సంక్రాంతేః పురుషస్యతు.

సంక్రాంతికి అధిదేవతయగు పురుషునకి మూడు తలలు నాలుగు ముఖములు మూడు కళ్లు పొడుగు చెవులు ఎత్తని దంతములు పొడుగైన కనుబొమ్మలు పొడవు ముక్కు ఎనిమిది బాహువులు రెండు కాళ్లు నలుపురంగు నూరు యోజనాల యున్నతి పన్నెండుగా విస్తీర్ణముండునని జ్యోతిషికులు వర్ణింతురు. దీనిని కాలపురుషుని వర్ణనగా గ్రహింపవచ్చును. భూతవర్తమాన భవిష్యత్కాలములు దక్షిణాయనోత్తరాయణములు ఋతువులు నెలలు ఆయా యావయవములుగా రూపింపబడెనేమో అని మన మూహింపవచ్చును.

ప్రకృతిమాత యొడలు సస్యశ్యామలమై సంక్రాంతి వచ్చు నాటికి అది పులకరించి ఫలించును తన గృహములను సస్యసంపదలతో నలంకరించును. సంక్రాంతి పురుషుని స్వాగతమునకు పల్లెటూరు రైతులు వరివెన్నుల కుచ్చుల తోరణములు కట్టుదురు వానినంటి వ్రాలి విహంగములు సంతోషముతో కిల కిలా రావములు చేయును. జంగము దేవరలు శంఖ మంత్రములు ప్రయోగింతురు. భక్తులు నగర సంకీర్తనలు కీర్తింతురు. సాతానిజియ్యరు, హరిదాసులు భక్తితో మేలుకొలుపులు పాడుదురు. కళాపోషణచేయు తరుణులు వాకిళ్లను తీర్చిన రంగు రంగుల ముగ్గులతో తమ వీధులను గ్రామములను రంగవల్లికలు తీర్చగా బాలికలు గొబ్బిళ్లు తీర్చి, దాని చుట్టు నాట్యములు చేయుదురు. ఆ ముగ్గులతో రథము గూడ తీర్చెదరు. అది సూర్యుని రథమును సూచించును. లోకములు చూచుటకు సూర్యుడు బంగారురథముతో వచ్చునని ఋషులు వర్ణించిరి. "ఇంట్ల మొదలను నీ రెండు సిరికలను, ననుగు దమ్ముడు నన్నయు నాటలాడు ... మకర సంక్రాంతి వేళ" అని శివరాత్రి మాహాత్మ్యములో శ్రీనాథుడు వర్ణించెను.

భోగిమంటలు వేసికొనుచు భోగినాడు జనులు తలంటు పోసికొని

నూవులు బెల్లము గుమ్మడి పండు దానమిచ్చెదరు పెద్దలకు తర్పణములు చేయుదురు. కుంకుమ సుగంధ ద్రవ్యములు ఇష్టులకు శిష్టులకు ఇచ్చి సత్కరింతురు. ఈ పండుగలో తేగముక్కలు చెఱకుముక్కలు మొదలగు భక్ష్యములు మాలలుగా గ్రుచ్చి తమ తమ బంధువులను హితులను ఆహ్వానించి గళములలో అలంకరింతురు.

విష్ణువు త్రివిక్రమావతారములో బలిచక్రవర్తి శిరస్సుపై తన మూడవ అడుగు నుంచి భూమ్యాకాశములను కొలచిన రోజులు . కాన ఈ పండుగను మూడు రోజులు చేయుట ఆచారమైనది. ఒకటి భోగి. రెండు పెద్ద పండగ. మూడవది కనుము. దీనిని మొక్కల పండుగ అనియు అందురు

డూ డూ బసవన్న అయ్యగారికి దండంపెట్టు అమ్మగారికి దండం పెట్టు అని గంగిరెద్దులను అలంకరించి వీధులలో ఆడింతురు

గొర్రెపొట్టేళ్లతో కోళ్లతో పందెములు వేయుట మొదలగు దుర్వ్యసనములతో మునిగి పొట్టేళ్ళ కోళ్ళ ధనహానిపోరాటంలో ప్రజలు సంతోషించుచుండుట ఘోర పాపము. ఈ పవిత్ర దినములలో ఇట్టివి మానివేయుట యుక్తము.

విజయదశమి దీపావళి పండుగలు మొదలుకొని భక్తుల పేరుల యందాపె బొమ్మపెళ్లిపేరియును. సంక్రాంతికి భక్తుల యారాధనను ప్రకటించేయు బొమ్మల నోములు సూచించును. పురక్షణమను నాడు మొదలుకొని గౌరీదేవి విగ్రహము మట్టిముద్దలతోచేసి రాత్రి నిదురకుపక్రమించు ఉదయము మేల్కొల్పుచు పూజింతురు పిదప ఈ విగ్రహములను పదిలోనో నెలలోనో విడచి దైవానుగ్రహమును ప్రసాద రూపముగా భావించి పెట్టుదురు.

సంక్రాంతి సందేశమును మనము గ్రహింపవలయును. దరిద్రులను ధనికులుగాను, అజ్ఞానులను జ్ఞానులుగాను దాసులను స్వతంత్రులుగాను గూర్చు ఉత్తమ జీవనములోనికి సంక్రమింపజేయుట కీసంక్రాంతి మనకు ప్రేరణ గలిగించుచున్నది. సంక్రాంతి మనకందించిన సందేశమును పరిగ్రహించి బాహ్యాలంకారము లందేగాక హృదయమందును ఉత్తమ భావములను సంక్రమింపజేసి సంక్రాంతి నామమును మనము సార్థకము చేయుదముగాక.